

# అమెరికా ఇల్లాలి ముచ్చట్లు
## శ్యామలాదేవి దశిక



అమెరికా ఐనా, అమలాపురమైనా ఇల్లాలు..ఇల్లాలే. ముచ్చట్లు ముచ్చట్లే..

ఓ అమెరికా ఇల్లాలు నెల నెలా మీతో పంచుకుంటున్న ముచ్చట్ల మురిపాలు..!

## తెలుగు టీవీ

ఇదిగో మిమ్మల్నే, ఆ దిక్కుమాలిన టీవీ కాసేపు ఆపేసి ఇలా వస్తారా లేదా?

ఎన్నిసార్లు పిలవాలి?

వారంలో ఐదురోజులు ఆఫీసుకు అతుక్కుపోతారు.

శని, ఆదివారాల్లో టీవీకి అతుక్కుపోతారు.

వున్నవాటికితోడు ఈ తెలుగు మేళం ఒకటి!

రాను రాను పిల్లలకంటే అన్యాయమయిపోతున్నారు. ఏమన్నా అంటే, "ఇదిగో వస్తున్నా...అదిగో వెళ్తున్నా" అంటారే కానీ జండాకర్రల్లే నిలబడి ఆ టీవీ ముందునుంచి మాత్రం కదలరు. పిల్లలు హోంవర్కులు మానేసి టీవీ చూస్తున్నారని, వెధవ సినిమాలు చూస్తున్నారని, చెత్త మ్యూజిక్ వింటున్నారని వాళ్ళమీద అస్తమానం అరిచేవారు.

ఇప్పుడు మీరు చేస్తున్నది ఏంటిట?

దేశంలో ఇంకేవీ విషయాలే లేనట్టు అన్నీ సినిమా కబుర్లే! పేర్లు ఎన్నైనా భగవంతుడు ఒక్కడే అన్నట్టు ఎన్ని ప్రోగ్రాములు చూసినా, ఏపేరు పెట్టినా అన్నీ సినిమా సంగతులే ! ఇంతోటి సినిమాలను 'వండర్‌ఫుల్...ఫెన్‌టాస్టిక్..' అంటూ ఆకాశానికెత్తేయడం. తీరా చూద్దునుకదా "గుండక్కా, గంటన్నంతా డొల్లే!" అని చంపుకోడాలు, నరుక్కోడాలు షరా మామూలే. వెనక సినిమాల్లో చక్కటి భాష, నటన, హావభావన, సున్నితమైన ప్రేమ, హాస్యం వుండేవి. ఇప్పుడు సినిమాల్లో వేసే వాళ్ళకు ఎవరికీ ఒక్క తెలుగు ముక్క రాదు. వాళ్ళు చెప్పే డైలాగులు మనబోటివాళ్ళకు అర్ధం కావు. ఆడవాళ్ళు మగవాళ్ళను మించిపోతున్నారు. ఇక పాటలు సరేసరి. వాయిద్యాలహోరులో ఒక్క ముక్కా వినపడదు. ఒకవేళ వినిపించినా అర్ధమయిచావదు. వెనక హీరో - హీరోయిన్లు పార్కులోనో, పూలతోటలోనో ఇద్దరే రొమాంటిక్‌గా పాడుకునేవారు. ఇప్పుడేమిటో, పాట మొదలవ్వడం ఆలశ్యం, ఓ ముఠా సిద్ధంగా వుంటారు వెనక. నాకు తెలీక అడుగుతా, ప్రేమించుకునేవాళ్ళు ప్రియుడితోనో ప్రియురాలితోనో ఏకాంతంగా వున్నట్టు ఊహించుకోవాలి గాని, ఇలా గుంపుతో ఊహించుకోవడమేమిటీ వాళ్ళబొంద......

ఏమిటీ సినిమాలు నచ్చకపోతే సీరియల్స్ బోలెడు వస్తున్నాయిగా అవి చూడమంటారా?

ఆ..ఆసంబడమూ అయింది. వీటిమీద ఆ సినిమాలే నయం. ఆ సీరియల్స్‌లో ఎవ్వరికీ పనీ పాటా వుండదల్లేవుంది. తీరికూర్చుని ఏడుస్తూవుంటారు. అందరూ టిప్పుటాపుగా తయారయి ఎన్నిసార్లు ఎన్నిరకాలుగా ఏడవచ్చో చూపించి మనల్ని

ఏడిపిస్తుంటారు !

పోనీ ఇవి కాకుండా వేరే ప్రోగ్రామ్స్ చూద్దామా అంటే ఆ యాంకర్లు చేసే హంగామా భరించాలి. పేరుకు తెలుగు ప్రోగ్రామే అయినా ఎవరో ఒకళ్ళూ అరా తప్పించి ఒక్కళ్ళకూ సరైన తెలుగొచ్చి ఏడవదు. లోపల అసలు సరుకు లేకపోయినా పై డాబులకు మాత్రం ఎవ్వరూ తీసిపోరు. పెద్ద యాంకరు దగ్గరనుంచి, పిల్లయాంకరుదాకా అందరూ కట్టిన చీర కట్టకుండా, వేసిన హైర్ స్టైయిల్ వెయ్యకుండా తయారవుతారు ! వాళ్ళ మొహాలు, చీరలు, నగలూ చూసి సంతోషించాల్సిందే తప్ప నోరు విప్పితే భరించలేం. మొహాలు ముద్దుగావుంటే బావుంటుంది కాని, మాటలు (కూడా) ముద్దుగా వుంటే తలమీద మొట్టాలనిపిస్తుంది. పోనీ దేశం వదిలి ఎన్నో ఏళ్ళైది, మన వంటకాలు కొత్తవి నేర్చుకుందామని అవి చూడ్డం మొదలుపెట్టా ! అదీ మూన్నాళ్ళ ముచ్చటే అయింది !

వాళ్ళు చూపించేవన్నీ 'చూంచాం' స్ప్రింగు రైసులూ, టొమేటో సూపులూ, పాస్టాలు---- కాంటినెంటల్-- . ఇదిగో మీకు తెలుసో లేదో ఇండియాలో ఇప్పుడెవ్వరూ ఇడ్లీలు, బుడ్లీలు తినటం లేదట ! ఉదయం ఓట్ మీల్, మధ్యాహ్నం మష్రూం సూపులు, రాత్రి భోజనానికి బర్గర్లు తింటున్నారట ! అందుకే టీవీ వాళ్ళు కూడా అవే నేర్పుతున్నారు. గరిట చేత్తో పట్టుకోడం కూడా రాని ఓ పాకశాస్త్ర ప్రవీణురాలు చెప్తూంటే విన్నాను, స్వీటులో చివరికి ఎలకల (యాలకుల) పొడి చల్లితే రుచిగా వుంటుందిట ! రుచి మాట ఏమోగాని తిన్నవాడెవడో ఠపీమని చావడం మాత్రం ఖాయం !!

సరే ఇవన్నీ నచ్చకపోతే హాయిగా భక్తి ప్రోగ్రాములు చూసుకోవచ్చు కదా అంటారా? నిజమే. కానీ వాళ్ళు మొక్కుబడిగా చూపించే ఒకటీ, రెండు భక్తి ప్రోగ్రాములు పొద్దున్నే పెట్టి ఓ పని అయిపోతుందనుకుంటారు. పక్క మీద నుంచి లేస్తూనే టీవీ ముందు కూర్చోడానికి ఆడదానికి అందులో ఇక్కడివాళ్ళకు ఎలా కుదురుతుందటా? అయినా నాకు తెలీక అడుగుతా, పొద్దున్న తప్పించి మిగిలిన టైములో భగవంతుని గురించిన విషయాలు తెలుసుకోరాదని రూలు ఏమైనా వుందిటండీ? చోద్యం కాకపోతేనూ !

ఏమిటండీ ఆ భాష ?

వెరీగుడ్డండీ--- ఒకేనాండీ---"చూద్దామా" అనడానికి 'ఓ లుక్కేద్దామా?"

ఒకావిడ అంటుంది ఉదయాన్నే 'మార్నింగు పూజ' చేస్తుందిట !

ఫలానా వ్యక్తి బాగా పాడితే "పాట ఇరగదీసాడండీ" అనాలిట !

ఫలానా వాడు డాన్స్ బాగా చేస్తే "కుమ్మేసాడు" అనాలిట !

ఇలా భాషను చిత్రవధ చేస్తూ----

ఏమిటీ ఇవాళ - రేపూ ఎవరూ భాషను పట్టించుకోడంలేదా? ఆడవాళ్ళు ఫ్యాషనుబుల్‌గా, స్టైలుగా వుంటే వాళ్ళు ఎలా మాట్లాడినా బాగానేవుంటుందా?

అలాగా ? నాకు తెలీదు సుమండీ !

అయితే ఆ రోజుల్లో నా ఇంగ్లీషుని మీరెందుకు హేళన చేసారుటా? చెప్పండి !

సరే నాక్కూడా ఏడువారాల నగలు, చీరలూ పట్టుకురండి. ఆ టీవీలో ఆడాళ్ళకుమల్లే సింగారించుకుని స్టైలుగా కనబడుతూ, ఒయ్యారాలు ఒలకబోస్తూ సుతారంగా మీకు సూపులు వడ్డిస్తా ! ఒకేనా ?